వామ్మో.. ఇవేం రోడ్లు

- జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- బురద, గుంతలతో అధ్వానంగా రహదారులు
- ద్విచక్ర వాహనాలు, అంబులెన్స్‌లు కూడా వెళ్లలేని దుస్థితి
- రాకపోకలకు అవస్థలు పడుతున్న ప్రజలు
- మరమ్మతులపై దృష్టిసారించని అధికారులు

సాక్షి ఫోకస్

జిల్లాలోని ఆయా మండలాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లకు మరమ్మతులు చేయకపోవడం.. భారీ వాహనాలు నిత్యం వెళ్తుండడం వంటి కారణాలతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లో వర్షపు నీరు నిలుస్తుండడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవతీసుకొని జిల్లా వ్యాప్తంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

మట్టిరోడ్లే దిక్కు


బురదగా మారిన కొటగూడ మట్టిరోడ్డుపై కాలినడకన వెళ్తున్న ప్రయాణికులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని అనేక గ్రామాలకు మట్టిరోడ్లు దిక్కవడంతో వానాకాలంలో అనేక అవస్థలు పడుతున్నారు. బురద వల్ల అడుగుతీసి అడుగు వేయలేకపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం కూడా రాలేని దుస్థితి నెలకొంటుంది. మండలంలోని కొటగూడ, అప్పపల్లి, సాలేగూడ, టేమ్రాన్ మోవాడ్, తేనుగూడ, హీరాపూర్, బలన్‌పూర్‌తో పాటు అనేక ఏజెన్సీ గ్రామాలకు నేటికీ మట్టిరోడ్లే దిక్కుగా ఉన్నాయి. వర్షం పడితే ఊరు కూడా దాటలేని పరిస్థితులు ఉంటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాకేంద్రంలోనూ అదే తీరు..

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని రాజంపేట రహదారి పనులు అసంపూర్తిగా నిలవడంతో రోడ్డుపై వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో రోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్డు బురదమయం అవుతుండడంతో పిల్లలు, వృద్ధులు జారి పడిపోతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు రాజంపేట రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.


అసంపూర్తిగా రాజంపేట రహదారి

గుంత.. ప్రయాణికుల చింత


మొగడ్‌దగడ్ చౌరస్తాలో భారీ గుంతలు

కౌటాల: మండల కేంద్రంలో అడుగడుగునా రోడ్లపై భారీ గుంతలు పడడంతో స్థానికుల తిప్పలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కౌటాలలో వర్షం వస్తే చాలు ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై భారీ గుంతలు పడడంతో వర్షం పడితే గుంతల్లో వరద నీరు చేరుతోంది. వర్షం తగ్గాక బురద మిగులుతోంది. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, మొగడ్‌దగడ్ రోడ్డు, విజయనగరం రోడ్డు, మార్కెట్ ఏరియా, శ్యాంమోడల్ స్కూల్, తలోడి చౌరస్తా, కౌటాల– బెజ్జూర్ ప్రధాన రహదారిపై భారీ గుంతలు పడ్డాయి. వర్షాలకు తోడు అధికలోడుతో కంకర లారీలు వెళ్తుండడంతో గుంతలు ఏర్పడ్డాయి. వానొస్తే భారీ గుంతల్లో నీరు నిలుస్తోంది. వీటిని గమనించకుండా పలుమార్లు వాహనదారులు అదుపుతప్పి పడుతున్నారు. భారీ గుంతల కారణంగా వాహనదారులకు నడుము నొప్పులు రావడంతో పాటు తరుచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు.


భారీ గుంతకు అడ్డుగా మార్కెట్ కాలనీలో రోడ్డుపై ఏర్పాటు చేసిన రాళ్లు

రోడ్లన్నీ గుంతలమయం


గుంతలమయంగా మారిన కల్వాడ -కుంచవెల్లి రోడ్డు

దహెగాం: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్ని ఛిద్రమయ్యాయి. మండల కేంద్రం నుంచి లగ్గాం, కల్వాడ నుంచి కుంచవెల్లి గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. గుంతల్లో వర్షపు నీరు నిలిచి ఉండడం, రోడ్లు బురదగా మారడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని బీబ్రా, పెసరికుంట గ్రామాల వద్ద ప్రధాన రహదారి ధ్వంసం కాగా మట్టి పోసి వదిలేశారు. దీంతో బురదగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దహెగాం – కాగజ్‌నగర్ ప్రధాన రహదారి కాగజ్‌నగర్ మండలం బట్టుపల్లి గ్రామ సమీపంలో రోడ్డంతా గుంతలమయంగా మారింది. డబుల్ రోడ్డు నిర్మాణంలో బట్టుపల్లి గ్రామానికి చెందిన రైతులు కోర్టులో కేసు వేయగా రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. గత ఐదేళ్లుగా సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు.


బట్టుపల్లి సమీపంలో బురదమయంగా రోడ్డు

కంకర తేలి అధ్వానం


బీటీ వేయకపోవడంతో తేలిన కంకర

కెరమెరి: మండలంలోని రాంజీగూడ గ్రామానికి వెళ్లే దారిలో అడుగడుగున గుంతలు పడి నడిచేందుకు వీలు కాకుండా మారింది. ధనోరా ప్రధాన రోడ్డు నుంచి మూడు కిలో మీటర్ల దూరంలో రాంజీగూడ గ్రామం ఉంది. ఏడాది క్రితం ఒక కిలోమీటర్ వరకు బీటీ నిర్మించేందుకు కంకర వేశారు. కానీ బీటీ వేయడం మరిచిపోయారు. మిగిలిన రెండు కిలోమీటర్ల రోడ్డును అలాగే వదిలివేయడంతో మట్టి రోడ్డుపై గుంతలు పడి వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే మూడు కిలో మీటర్లు బీటీ వేయాలని ఆదివాసీలు కోరుతున్నారు.


గుంతల్లో నిలిచిన నీరు

కాలినడకన ప్రయాణం

పెంచికల్‌పేట్: గత పదిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని రహదారులు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పెంచికల్‌పేట్ నుంచి సలుగుపల్లి వెళ్లే రహదారిపైన గుంతల్లో నీరు నిండిపోవడంతో చెరువును తలపిస్తోంది. ఎల్లూర్ నుంచి మెరెగూడ రోడ్డు బాగా లేక మూడు కిలోమీటర్లు బురదలో కాలినడకన ప్రయాణం సాగిస్తున్నారు. అగర్‌గూడ నుంచి కమ్మర్‌గాం మీదుగా నందిగామ, మురళీగూడకు రహదారి లేక బురదరోడ్డు మీదుగా ప్రయాణాలు చేస్తూ అవస్థలు పడుతున్నారు.


గుంతలమయంగా సలుగుపల్లి రహదారి

క్లుప్తంగా

రోడ్డుకు మరమ్మతులు


కర్జి రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న బీజేపీ నాయకులు

సాక్షి స్పందన

దహెగాం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ గుంతలమయంగా మారి వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై సాక్షిలో కథనం ప్రచురితం కాగా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు స్పందించారు. ఎమ్మెల్యే ఆదేశాలు, సహకారంతో మండలంలోని గెర్రె నుంచి కర్జి వరకు గుంతలు, బురద ఉన్న చోట మొరం, కంకర పోశామని బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గుంతలు ఏర్పడ్డ రోడ్లపై మొరం పోయాలని ఎమ్మెల్యే ఆదేశించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కొండ్ర తిరుపతిగౌడ్, నాయకులు సుధాకర్‌రావు, దెబ్బటి సత్యనారాయణ, బక్కన్న, బాపు, రాజన్న, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరుగుతూ ఆరోగ్యంపై అవగాహన


నిల్వ నీటిని తొలగిస్తున్న సిబ్బంది

వాంకిడి: మండలంలోని గణేశ్‌పూర్ గ్రామంలో వైద్యఆరోగ్య సిబ్బంది సోమవారం ఇంటింటికీ తిరుగుతూ ఆరోగ్యం, పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో పారిశుధ్యం లోపించకుండా చూసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా టైర్లు, ఖాళీ కొబ్బరి బోండాలు, చిప్పలు, నిరుపయోగంగా ఉన్న పాత్రలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నేడు ఆదివాసీ సంఘాల సన్నాహక సమావేశం

కౌటాల: మండల కేంద్రంలో కుమురంభీం కమ్యూనిటీ భవనంలో మంగళవారం ఆదివాసీ సంఘాల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహక కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. సమావేశంలో ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లపై చర్చించనున్నట్లు తెలిపారు. నేడు సాయంత్రం 4.30 గంటలకు సమావేశం ఉంటుందని, మండలంలోని ఆదివాసీ సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

4న ఆషాఢ బోనాలు

కౌటాల: మండల కేంద్రంలో కంకలమ్మ దేవి ఆలయంలో ఆగస్టు 4న భక్తిశ్రద్ధలతో ఆషాఢ బోనాల జాతరను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య సోమవారం తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తామని, అనంతరం కౌటాల రామాలయం నుంచి కంకలమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. బోనాల జాతర సందర్భంగా ఆలయం భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలోని భక్తులు బోనాల జాతరలో అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

పట్టాలు ఇవ్వాలని వినతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలోని రాజన్న కాలనీవాసులు ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ సింగరేణి పరిరక్షణ బస్సు ప్రారంభ సభకు హాజరైన ముఖ్య అతిథి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందించి ఈ సందర్భంగా పట్టాలిచ్చి అన్ని సౌకర్యాలు కల్పించేంత వరకు మీ వెనకాల ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బోడంకి చందు, రవి, సమ్మక్క, ఉమారాణి, నాగజ్యోతి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వాగుదాటే ప్రయత్నం చేయవద్దు

ఇంద్రవెల్లి: మారుముల గ్రామీణ ప్రాంత ప్రజలు ఉధృతంగా ప్రవహించే వాగు దాటే ప్రయత్నం చేయవద్దని ఎస్సై దుబ్బక సునీల్ అన్నారు. సోమవారం డీడీఆర్‌ఎఫ్ పోలీసు బృందంతో కలిసి సిరికొండ మండలంలోని కన్నాపూర్ గ్రామం వాగు వద్ద తాళ్లు కటి ఇంద్రవెల్లి మండలంలోని గోపాల్‌పూర్, గోపాల్‌పూర్ గూడ గ్రామాల ప్రజలకు రాకపోకలు సాగించేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా.. అధికారులకు, పోలీసు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిరికొండ మాజీ జెడ్పీటీసీ కుమ్రం రఘురాం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పులుల సంరక్షణ అందరి బాధ్యత


దహెగాం: గిరవెల్లిలో పులుల దినోత్సవంపై అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎస్‌వోలు


కాగజ్‌నగర్‌రూరల్: పులుల గురించి అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం సభ్యులు

దహెగాం: పులుల సంరక్షణ అందరి బాధ్యత అని ఎఫ్ఎస్‌వోలు రవికుమార్, బాపు అన్నారు. సోమవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మండలంలోని గెర్రె, గిరవెల్లి గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ పట్టణంలో..


కాగజ్‌నగర్‌రూరల్: అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అటవీశాఖ కార్యాలయం నుంచి అటవీశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వంజీరి, నందిగూడ, అంకుసాపూర్ గ్రామాల్లో కళాజాత బృందాలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో అప్పలకొండ, ఎఫ్ఆర్‌వో రమాదేవి, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జైనూర్‌లో..

జైనూర్: వన్యప్రాణులను, అడవులను సంరక్షించడంతోనే మానవ మనుగడ, జీవన పరిస్థితులు మెరుగుపడుతాయని ఎఫ్ఆర్‌వో జ్ఞానేశ్వర్, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవరావులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు అడవులు అంతరించిపోతున్నాయన్నారు. అడవులు అంతరించిపోతే మానవ జీవన పరిస్థితులు కఠినమవుతాయని పేర్కొన్నారు. అడవులను, వన్య ప్రాణులను సంరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా ఆదివాసీ ఐకాస ప్రతినిధి ఆత్రం భీంరావు, తదితరులు ఉన్నారు.

డ్రెయినేజీ లేక రోడ్డుపైనే మురుగు నీరు

ఆసిఫాబాద్‌రూరల్: డ్రెయినేజీల నిర్మాణం చేపట్టకపోవడంతోనే మురుగు నీరు రోడ్లపైనే నిలుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని బూర్గుడ గ్రామంలో డ్రెయినేజీలు నిర్మించలేదు. దీంతో మురుగు నీరు రోడ్లపైనే నిలుస్తుంది. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది దుర్గంధం వెదజల్లుతుందని కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు రోడ్డు పక్కన డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


బూర్గుడలో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

రెబ్బెన: మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీం ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో షీటీం ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలపై హింసా, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు ఎవరైనా గురైతే వెంటనే షీ టీంను సంప్రదించాలన్నారు. సామాజిక మాధ్యమాల వినియోగం విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఫొటోలు, వీడియోలను పోస్ట్‌చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని మహిళలకు రక్షణ కల్పించడం కోసమే షీ టీంలు పని చేస్తున్నాయని, ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. షీ టీం సభ్యులు సునీత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

నిర్మాణానికి మోక్షమెప్పుడో..?


రాంజీగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాల

- పాఠశాల భవన నిర్మాణానికి రూ.75 లక్షలు మంజూరు
- ప్రారంభం కాని పనులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు
- అధ్వానంగా రాంజీగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాల

కెరమెరి: కనీస సౌకర్యాలు లేకపోవడంతో మండలంలోని రాంగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా భవన నిర్మాణానికి రూ.75 లక్షల నిధులు మంజూరైనా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. ఇటీవల టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కాగా అగ్రిమెంట్ మాత్రమే మిగిలింది.

8 తరగతులు.. 5 గదులు

రాంజీగూడ పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 100 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ముగ్గురు రెగ్యులర్, ఎనిమిది మంది సీఆర్టీలతో విద్యా బోధన కొనసాగుతోంది. ఇక్కడ వరకు బాగానే ఉన్న తరగతి గదులు లేకపోవడంతో ఒక్కో తరగతి గదిలో రెండేసి తరగతులను కూర్చోబెట్టి బోధన చేస్తున్నారు. దీంతో ఒక తరగతి బోధన చేస్తున్నప్పుడు మరో తరగతి విద్యార్థులు ఆరుబయట ఉండాల్సిన పరిస్థితి ఉంది. డార్మెంటరీ కూడా లేకపోవడంతో ఆరుబయటే భోజనాలు చేస్తున్నారు. కాగా ప్రస్తుతం ఉన్న పాఠశాల భవనం 40 ఏళ్ల కిందట నిర్మించింది కాగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో భవనం ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. నూతన భవనం మంజూరు చేయాలని గ్రామస్తులతో పాటు ఉపాధ్యాయులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులకు నివేదికలు పంపగా ఎట్టకేలకు రూ.75 లక్షలతో 4 తరగతి గదులు నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఈ విషయంపై ఐటీడీఏ ఏఈ నజీమోద్దిన్‌ను వివరణ కోరగా పాఠశాల భవన నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, త్వరలోనే అగ్రిమెంట్ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామన్నారు.


డార్మెంటరీ లేకపోవడంతో ఆరుబయటే భోజనాలు చేస్తున్న విద్యార్థులు

సౌకర్యాలు లేక ఇబ్బందులు



పాఠశాలలో సరైన సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఒకే గదిలో బోర్డింగ్ (వసతి), బోధన జరుగుతుంది. తరగతి గదులు సరిపోవడం లేదు. ఒక్కో గదిలో రెండు తరగతులు కొనసాగుతున్నాయి. అధికారులు స్పందించాలి. భవన నిర్మాణం ప్రారంభించాలి.

– కోట్నాక వినేశ్, 10వ తరగతి

కొత్త భవనం నిర్మించాలి



పునరావాస కేంద్రంలో నూతన భవనం నిర్మాణం చేస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుంది. గదులు సరిపోవడం లేదు. డార్మెంటరీ కూడా లేదు. కాగా నూతనంగా మంజూరైన 4 గదులతో పాటు మరో 5 గదులు మంజూరు చేయాలి.

– లింబారావు, ప్రధానోపాధ్యాయుడు

రైతుబీమా సవరణకు అవకాశం

కెరమెరి: రైతుబీమా సవరణకు మంగళవారం చివరిరోజు అని ఏఈవో వెంకటేశ్ అన్నారు. సోమవారం మండలంలోని జోడేఘాట్, పాట్నాపూర్ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. రైతు బీమా రెన్యువల్ చేయని వారు వెంటనే చేసుకోవాలని సూచించారు. మృతి చెందిన నామినీ స్థానంలో కుటుంబ సభ్యుల్లో మరొకరి పేరు నమోదుకు అవకాశం ఉంటుందన్నారు. నూతన నామినీ వివరాలు సమర్పించాలని కోరారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో వెంకటేశ్

వృద్ధురాలికి ఆర్థిక సాయం

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన జానాబాయి ఇల్లు ఇటీవల భారీ వర్షానికి కూలిపోగా బాధితురాలికి సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ సహాయంతో కాంగ్రెస్ నాయకులు రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. భారీ వర్షాలకు నష్టపోయిన వారికి అండగా ఉంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో కౌటాల, చింతలమానెపల్లి మాజీ ఎంపీపీలు బసర్కార్ విశ్వనాథ్, దుబ్బుల నానయ్య, నాయకులు ఖలీం పాషా, రుషి, నాహీం తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : శివకుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899